కళ్ళలో నీళ్ళు గిర్రున తిరిగాయి.

"అక్కా"— బేలగా, విస్మయంగా చూసింది సృజన. ఆ పిల్లకి ఏం తోచడం లేదు.

'ఆ క్రూరాళ్ళలా నిరాక్షిణ్యంగా వత్తి కాయల్లా కళ్ళు తెరుచుకుని చూస్తుంటే అక్క ఎలా–'

శ్రీలేఖకి దుఃఖం ముంచుకొచ్చింది. బాబుని సృజన కందించి వాడి ఏడుపుని వినలేనట్టు లేచి టాయ్‌లెట్ వైపు నడిచింది.

నాలుగడుగులు వేసిందో లేదో- తుఫాను వెలిసినట్టు, ఒక్కసారిగా బాబు ఏడుపాగిపోయింది. దడదడలాడే గుండెతో ఏమయిందోనని వెనుదిరిగిన శ్రీలేఖ విశ్చేష్టురాలయి నిలబడిపోయింది.

క్రూరాళ్ళ కేకలు సడెన్‌గా ఆగిపోయాయి. ఆ దృశ్యానికి సిగ్గుపడుతున్న దానిలా తల వంచుకున్నా ఆనందిస్తోంది సృజన. "మాతృత్వం" పేరుతో చెయి దిరిగిన చిత్రకారుడు గీసిన బొమ్మలా- -ఆర్ట్ ఫెలో- గిరిజన యువతి- పల్లెదున్న పోతు- నిర్వికారంగా పల్లిగ్గా- సిగ్గులేకుండా రవిక లేని శరీరంతోనే బాబుని గుండెకు హత్తుకుని పాలిస్తోంది.

అమడ దూరం కంపు కొడుతున్న ఆ చింకి చీరనే బుల్లి చేతులతో తడుము తున్నాడు బాబు కాళ్ళాడిస్తూ. ●



# మధుర తరంగాలు

వనిమిరెడ్డి సువర్ణ

మ్రోగకుండా అదే పనిగా మ్రోగుతోంది టెలిఫోన్. "హబ్బబ్బా ...ఎవరక్కడ వెంకమ్మా...రంగన్నా.." పెద్దగా కేకేసినా ఎవరూ రాకపోవడంతో వ్రాస్తున్న పెన్ అక్కడే పెట్టేసి విసుక్కుంటూ వచ్చి రిసీవర్ అందుకున్నారు సుప్రసిద్ధ నవలా రచయిత్రి నిర్మలాదేవి.

"హలో.... నిర్మలాదేవి హియర్."

".... .... ...."

"ఓ మీరా! ఆఁ"

"అబ్బే లాభం లేదండీ. అయినా ఎంత బిజీవేళ కదా ఎక్కువ. మీరు చెప్పినదాని కన్నా నేనడిగింది."

"...."

"ఆరు గంటలకి ఒక ఫంక్షన్‌కి అటెండ్ అవ్వాలి. అప్పటి వరకు ఇంట్లోనే వుంటాను."

".... .... ...."

"అలాగే. థాంక్స్"

రిసీవర్ క్రెడిల్ మీద వుంచి వెనుతిరిగింది ఆనందంతో.

ఇంతలో మళ్ళీ పిలిచింది. టెలిఫోన్.

తనే అందుకుంది. రంగన్న ఎక్కడికెళ్ళాడా అనుకుంటూ.

".... ...."

"ఆఁ.... నేనే మాట్లాడుతున్నాను."

"...."

"థాంక్సండీ."

".... ...."

"థాంక్యూ వెరీ మచ్."

ఇంతలో లైన్ కట్టయింది.

'థాంక్ గాడ్' అనుకుంటూ రిసీవర్ పెట్టేసింది.

అభిమానుల పరంపర.

మొదట్లో అంతులేని ఆనందం. కానీ.... రాను రాను విసుగు పుడుతుంది కానీ తను రిసీవ్ చేసుకునేది ఎప్పుడో ఒకసారి. అందుకే విసుకు కనపర్చకుండా వాళ్ళు అడిగిన వాటికి జవాబులిస్తుంది పాపం తనూ ఒకప్పుడు వాళ్ళలాంటిదే కదా అన్న సానుభూతితో.

తనూ.... మొదట్లో చిన్న చిన్న కథలు వ్రాసేది. వాటిని అలాగే వదిలేయకుండా పట్టుదలతో సీరియల్స్, నవలలు ఒకటేమిటి ఎన్నో వ్రాసి ఇప్పుడు ప్రసిద్ధి పొందిన రచయిత్రులలో తనూ ఒక మెంబర్ అయింది.

ఐదారు నవలలు సినిమాలుగా కూడా వచ్చాయి. అన్నీ 'సూపర్ హిట్'. అందుకే ఈ సారి తను వ్రాసిన "మధుర తరంగాలు" నవల సినిమా తీస్తామని నిర్మాత రాగానే రేటు పెంచేసింది. వాళ్ళే ఇందాక ఫోన్ చేసింది. తను చెప్పినంతకే ఒప్పుకున్నారు. "ఆ.. అయినా వాళ్ళకెంత లాభమో కదా!" అని ఆలోచిస్తూ కూర్చుంది.

ఇంతలో "టీ" కప్పుతో రంగన్న వచ్చాడు. కప్పు అందుకొని "నాకోసం ఎవరైనా వస్తే కూర్చోమని చెప్పు" అంటుండగానే కనకలక్ష్మి వచ్చింది. ఈ రోజు ఒక ఫంక్షనుంది వెళ్ళాలంటూ.

కనకలక్ష్మి నిర్మలాదేవిగారి పర్సనల్ సెక్రెటరీ.

"ఆఁ.... నాకు గుర్తుందిలే" అంటూ రెండు గుక్కల్లో టీ తాగడం పూర్తిచేసి లోపలికెళ్ళారు నిర్మలాదేవి రెడీ అవటానికి. ఐదున్నర అవుతూవుండగా వచ్చారు వాళ్ళు! అప్పుడే "మేకప్" పూర్తయి కారు కీస్ తీసుకుని హాల్లోకి వచ్చింది నిర్మలాదేవి.

కాసేపు నవలలోని సన్నివేశాల గురించి మాట్లాడుకున్నాక ఆమె అడిగినంతా చెక్కు రూపంలో ఇచ్చి వెళ్ళిపోయారు.

వాళ్ళు వెళ్ళగానే ఆనందం పట్టలేక ఎగిరి గంతేసింది సుప్రసిద్ధ నవలా రచయిత్రి నిర్మలాదేవి.

అంతే.

...దబ్‌మని క్రింద పడటంతో మెలకువ వచ్చింది నిర్మలకి.

"ఆఁ ... ఇదంతా కల" నిస్పృహతో లేచి గబుక్కున మంచమెక్కేసింది నిర్మల.

టైమ్ చూసింది మూడవుతూంది.

"మధ్యాహ్నం పన్నెండింటప్పుడు ఈ రోజు ఎలాగైనా కథ వ్రాయాలని ఆలోచిస్తూ పడుకుంది. ఆలోచిస్తుండగానే నిద్ర పట్టేసింది కాబోలు!'

తన కలకి తనే నవ్వుకుంది.

పాపం నిర్మల! ●